# మహాభాగ్యం

**జీవితం మీద కన్నీరు మునురుకున్నప్పుడు లేలేత కిరణాల్లా వెచ్చగా పలకరించే ఆప్తులుండడం కన్నా మహద్భాగ్యం మరొకటేముంటుంది?**

కడుపు కోతకంటే దుఃఖానుభవం ఏముంటుంది? శ్రావణ కుమారుడు పోవడం వల్ల వృద్ధ రుషి దంపతులకు, అభిమన్యుడు యుద్ధంలో నిహతుడు గావడం వల్ల సుభద్రార్జునులకు, పలనాటి బాలవీరుణ్ణి కోల్పోవడం వల్ల ఐతాంబ బ్రహ్మనాయకులకు ఎదురైన అనుభవమే! ఓదార్చేవాళ్ళు ఊరడించినకొద్దీ మనసును వికలం చేసేదీ, ఎవరి పాపం, ఎవరి దుర్మార్గం, ఎవరి నిర్లక్ష్యం దురన్యాయానికి కారణమైందో తోచనిదీ, గుండెల్లో ఊరి నరాల చిమ్మనగ్రోవుల్లో నుంచి ఎగసి వచ్చి కళ్ళను చెమ్మగిలచేసేదీ, మంటికీ మింటికీ ఏకంగా ఉబికిపోయిన శోకసాగరంలో ఆ దంపతులు చిరు చేపల్లా ఈదులాడుతూ ఉండిపోయిందీ- అయ్యో, అదెంత గడ్డుకాలం! ఆ నైరాశ్య యుగంలో, నిస్పృహాశకంలో ఒకనాటి ఉదయం-

ఇంకా భళ్ళున తెల్లవారలేదు. పాలవాళ్ళు, పేపరు కుర్రాళ్ళు మాత్రం సైకిళ్ళమీద బెల్ మోగించుకుంటూ వీధిలో దూసుకుపోతున్నారు. జనసంచారం అట్టే ప్రారంభం కాలేదు. వరండాను, ఇంటి ముంగలిని వేరుచేసే గ్రిల్స్ దగ్గర కిందికి దిగడం కోసం కట్టిన మెట్టుమీద కూర్చున్న నీలమణి శూన్యదృక్కులతో ఎటో చూస్తోంది. అరు బయట పడివున్న పేపరును తీసుకెళ్ళి వెలుతురు పడడానికి వీలుగా గృహాంతర్భాగం వైపు తిరిగి కూర్చున్న రమణమూర్తి ఇంకా రెండో పేజీలోకి వెళ్ళలేదు. ఉన్నట్టుండి వెనుకవైపు నుంచి సన్నగా ఏడుపు వినిపించడంతో అతడు మెడ తిప్పి వెనక్కు చూశాడు. అది ఇద్దరి ఏడ్పుల సమ్మేళనమని అప్పుడుగానీ తెలిసిరాలేదు. ఒకావిడ- ఎక్కడ నుంచి వచ్చిందో, ఎలా వచ్చిందో నీలమణి పక్కన వాలిపోయింది. ఆమె ఒడిలో తలపెట్టుకుని నీలమణి దురపిల్లిపోతోంది. ఈమెను పొదివి పట్టుకున్న ఆగంతుకురాలు గూడా తల కిందికి వాల్చేసింది. ఆవిడ కన్నీరు నీలమణి చెంపను తడి చేస్తోంది. ఒకటి రెండు నిమిషాల్లోనే తేరుకున్న రమణమూర్తి "ఇదిగో నీలమణీ! తెల్లవారే సమయంలో కడపలో కూచుని ఏడవొచ్చా? వద్దొద్దు. లేచి లోపలికి వచ్చేయండి" అని వారించాడు. అయినా అతడి హెచ్చరిక వాళ్ళ చెవిదాకా వెళ్ళినట్టే లేదు. ఒకటి శోకరుద్ధమైన గొంతుక, ఇంకొకటి గుండెలకు చేరవగా వెళ్ళి దుఃఖాన్ని పంచుకుంటున్న సహానుభూతి. రమణమూర్తికైనా గట్టిగా కలుగజేసుకోడానికి వీల్లేని పరిస్థితి. "నీలా! చెప్పినమాట వినవూ? బాగుండదు. చూసినవాళ్ళేమనుకుంటారు? లేచి వచ్చి గది లోపలికి వెళ్ళిపోవచ్చుగదా!" అన్నాడు మరింత అనునయంగా. నీల లేచింది. కళ్ళు తిరుగు తున్నట్టుగా తూలిపోతూ గదిలోపలికి కొట్టుక పోయింది. ఆమెను వెన్నంటి లోపలికి వచ్చిన ఆగంతుకురాలు పలకరించేదాకా రమణమూర్తికి ఆమె ఎవరో తెలిసిందిగాదు.

"ఏమండీ బావగారూ! మీరేనా? గుర్తుపట్టలేకపోయాను. అయిదేళ్ళయిందేమో చూసి. అప్పటికీ, ఇప్పటికీ పోలికే లేదు. అయ్యో, మీరే ఇలాగైతే ఎలాగండీ? మిగిలిన పిల్లలు దిగులుపడిపోరూ? మీరే ఇలా కుంగిపోతే, నీల నడుము పైకి లేస్తుందా?"

ఆమె ఎవరో పోల్చుకునేసరికి రమణమూర్తి కళ్ళు చెమ్మగిలిపోయాయి. "ఇంకెలా ఉంటానమ్మా సత్యా! రెండుసార్లు జబ్బు పడ్డాను. హాస్పిటల్లో ఉన్నాను. డాక్టర్లు ఎలాగో ఒడ్డున పడేశారు. రోజుకు గుప్పెడు మాత్రలతో, కఠిన పథ్యంతో కాలం వెళ్ళబుచ్చుతున్నాను. చాలనిదానికి ఈ అవాంతరం ఒకటి. శరీరానికీ, మనసుకూ గూడా దెబ్బ తగిలింది. ఏదో ఇలాగైనా మిగిలి ఉన్నానంటే అదే గొప్ప కదా!"

"ఏమండీ! మీరెక్కడ? వచ్చి ఇలా బావగారి దగ్గర కూచోండి. నేను నీల దగ్గరకు వెళ్తాను" అంది సత్య, వెలుపలికి చూస్తూ. అందాకా నేపథ్యంలో ఉండిన సీతాపతి వసారాలోకి వచ్చి రమణమూర్తి ఎదుట కూచున్నాడు.

ఆ ఇద్దరికీ మధ్యగల పరిచయం కొద్దిపాటిది. ఓదార్చడానికని సీతాపతి గానీ, పలకరించడానికని రమణమూర్తి గానీ ఒకరివైపొకరు చూసుకోగల నిబ్బరం లేక, అట్లాగే కొంతసేపు విగ్రహాల్లా కూర్చుండిపోయారు. ఉండి ఉండీ సీతాపతే ప్రారంభించాడు-

"మాకు నిన్నటి ఉదయమే తెలిసింది. ఈవైపునుంచి వచ్చినవాళ్ళెవరో సత్యకు ఫోన్ చేసి చెప్పారట. వింటూనే కుప్పకూరలా కూలిపోయింది. మా రెండోవాడు కారు తీసుకెళ్ళిపోయి సాయంకాలం అయిదింటికిగానీ రాలేదు. మేము ఆరింటికి బయల్దేరాము..."

"అయ్యో పాపం! రాత్రంతా ప్రయాణం చేశారన్నమాట!" నొచ్చుకున్నాడు రమణమూర్తి.

"కర్నూలు, కడప మైన వచ్చాము. ఉదయం అయిదింటికే ఇంటికి రావలసింది. మీరు లేచి ఉండ రేమోనని హోటల్లోనే ముఖం కడుక్కున్నాము. పనిలోపనిగా టిఫిను గూడా కానిచ్చాము లెండి. మీరిప్పుడు మాకోసమని శ్రమ తీసుకోవద్దు..."

"మొదట మీకు సంజాయిషీ చెప్పుకోనివ్వండి. జరిగిన దుర్ఘటన మాపైన పిడుగులా పడింది. ఎవరికీ తెలియజేసే స్థితిలో లేము. ఆపనికి బంధుమిత్రులే పూనుకున్నారు. మిమ్మల్ని గురించి మావాళ్ళకెవరికీ తెలియదుగదా! పొరబాటు జరిగిపోయింది. మరేమీ అనుకోకండి. మాకంతా అయోమయంగా ఉండిపోయింది. ఈనాటికీ ఆ స్థితిలో మార్పు లేదు..."

గదిలో నుంచి ఏడుపులు, ఓదార్పులూ ఎడతెగకుండా వినవస్తున్నాయి.

రమణమూర్తి కూర్చున్న చోటునుంచే వారించ బోతే సీతాపతి అడ్డుకున్నాడు. "పరవాలేదు. కాసేపు వాళ్ళపాటుకు వాళ్ళనలా ఉండనివ్వండి. సొద కాస్తా తగ్గాలంటే ఆమాత్రం కిందుమీదులు కావలసిందే!"

భార్యను మందలించడానికి మాత్రమే అలవాటు పడిన రమణమూర్తి సీతాపతి ధోరణికి కొంచెం విస్తుపోయాడు. సత్యవతిని పెళ్ళాడడానికి మునుపు ఆ ఇద్దరివీ సాదా సీదా మధ్యతరగతి కుటుంబాలు. సీతాపతి రెవిన్యూ శాఖలో చిన్న ఉద్యోగి. కొన్ని ఉద్యోగాలు తిండికీ, బట్టకూ వెరవు చూపించగలవే గానీ, అంతకుమించి జీవనస్థాయిని పెరగనివ్వవు గదా! ఆ సత్యమైతే అందరికీ తెలును గానీ, ఉన్న ఉద్యోగాన్ని వదిలిపెట్టి మరొకవిధంగా జీవితాన్ని మలుచుకోవడానికి ప్రయత్నించేవాళ్ళెందరు? ఈ కొందరి కోవలోకి చేరిపోయాడు సీతాపతి. చిన్న కాంట్రాక్టరుగా రంగంలో ప్రవేశించి, అంతస్తులు పైన అంతస్తులు నిర్మించినట్టుగా జీవితంలో మెట్లెక్కగలిగాడు. జీవితరథం పైన విజయకేతనం ఎగురవేయగలిగాడంటే అందుకు కారణం తాను



చిత్రాలు: నర్సిం


సత్యవతిని చేపట్టడమేనన్నది అతడి ప్రగాఢ విశ్వాసం. అందువల్ల ఆమె ఎప్పుడు, ఎలాంటి కోరిక కోరినా చెల్లించడం తన నైతిక బాధ్యతగా భావిస్తాడు. కాకపోతే దుఃఖంలో ఉన్న స్నేహితురాల్ని చూడాలని కోరుకుంటే, అప్పటికప్పుడే ప్రయాణం పెట్టుకుని కారులో వరతెంచి వస్తాడా?

"బిడ్డలు బాగున్నారు గదండీ?" నిబ్బరం తెచ్చుకున్నాక అడిగాడు రమణమూర్తి.

ఆర్జన విషయంలో కొంత గుంభనంగా ఉన్నా, బిడ్డల్ని గురించి బాహాటంగా చెప్పుకోవడమంటే సీతాపతికి చాలా ఇష్టం. కాంట్రాక్టు పనుల్లో ఇంజనీర్లను సమాధానపరచడంలో అతడెన్నో సాధకబాధకాలు రుచి చూశాడు. అందుకు 'టిట్ ఫర్ టాట్'గా తన ముగ్గురు కొడుకుల్నీ ఇంజనీర్లుగా చేసేశాడు. పెద్దబ్బాయి రాజా ఒక పెద్ద ఫర్మ్‌లో ఉద్యోగం చేస్తూ విశాఖపట్నంలో

స్థిరపడ్డాడు. సీతాపతి తన పర్యవేక్షణలో అతనికక్కడ శాంతినగర్‌లో పెద్ద భవంతి కట్టి ఇచ్చేశాడు. మూడోవాడు శ్రీపతి. బెంగుళూరులో ఓ గృహనిర్మాణ సంస్థకు ముఖ్య సలహాదారుగా ఉన్నాడు. ఇళ్ళూ, కార్లూ కొనడం, అమ్మడం వాడి హాబీ. రెండోవాడు కృష్ణ మాత్రం హైదరాబాద్ శ్రీనగర్‌లో తల్లితండ్రులతోపాటు నివసిస్తూ రాష్ట్ర ప్రభుత్వ నీటిపారుదల శాఖ కింద వంతెనలు, ఆనకట్టలు నిర్మించే పనులు నిర్వహిస్తున్నాడు. అమ్మాయి రేణు భర్త పెద్ద గెజిటెడ్ ఆఫీసరు. శ్రీనగర్‌లో తమ నివాసానికి ఒక కిలోమీటరు దూరంలోనే వాళ్ళ నివాసం.

సీతాపతి ఈ వివరాలన్నీ చెప్పి ముగించేసరికి, హఠాత్తుగా ఒక నిర్ణయం తీసుకున్నట్టు సత్యవతి గదిలో నుంచి ఈవలికి వచ్చేసింది. "ఏమండీ బావగారూ! ఆపద సంగతి సరే! ఏడుపొచ్చినప్పుడు ఏడవాల్సిందే! తప్పదు. అయితే, ఎంత జబ్బుకైనా మందంటూ ఒకటి ఉండదా? నాలుగ్గోడల మధ్యనే కుమిలిపోతే ఎలాగండీ! వీధిలో అడుగు పెట్టి మూడు నెలలైందటగదా! ఇదేం బాగుండలేదు. మీరు బయల్దేరండి. నాలుగు రోజులపాటు గుళ్ళూ, తీర్థాలూ, ఆశ్రమాలూ తిరిగొద్దాం. మీరు లేచి స్నానం చేసే లోగా మేము బుట్టలు, బట్టలూ సర్దేసుకుంటాం..."



ఇది అభ్యర్థనా? ఆదేశమా? ఏదైనా కావచ్చు. ఈ దుమ్ము దులిపే చొరవ సత్యవతికెలా వచ్చిందో రమణమూర్తికి తెలుసు. మారుతల్లి నిరాదరణలో మగ్గిపోతున్న నీలమణికి ఓదార్పు, ధైర్యం, నిబ్బరం ఇచ్చింది సత్యవతే. రెండు వాటాల లోగిలి వాళ్ళది. అందులోని ఒక వాటాలో నీలమణి వాళ్ళు అద్దెకుండేవాళ్ళు. నీల తండ్రి హైస్కూల్లో టీచరు. పిల్లనిచ్చిన మామగారుగానే కాదు, అంతకు ముందునుంచీ ఆయన్ను రమణమూర్తికి తెలుసు. ఎలా తెలుసునంటే ఏం చెప్పాలి? తల్లి పుట్టినిల్లు మేనమామకు తెలియదా అంటారుగదా! మేనమామ సంగతి మేనల్లుడికి మాత్రం తెలియకపోతుందా? అదీ సంగతి. ఆ ఇంటి ఆనుపానులన్నీ రమణ మూర్తికి తెలుసు. మేనమామ మంచిచెడ్డల విచక్షణ విషయంలో వట్టి ఖయాలీ బాబత్తు. ఏ గాలికా చాపే. తనకిష్టమైనవేవీ పొందగలిగే అవకాశం నీలమణికుండేది కాదు. బట్టలుండేవి కావు. తన ఇష్టాన్నిబట్టి 'ఇదిగో ఇది తినమ్మా' అనగలిగే మమకారాలుండేవి కావు. ఎప్పుడో, ఏ మూడు నెలలకో సినిమాకు వెళ్ళాలన్నా వీలయ్యేది కాదు. ఇలాంటి అవసరాలెన్నింటికి ఆదుకుందో సత్యవతి!

కారులోగూడా సత్యవతే ప్రధాన వక్త అయిపోయింది. విడ్డూరమేమిటంటే, తాను స్నేహితురాలు ఒక్కతెతోనే మాట్లాడుతున్నట్లు సత్యవతి, ఆమె చెబుతున్నది తనకొక్కర్తెకు మాత్రమేనని నీలమణి భావించడం! ఒకరికొకరు లోకమైపోవడమంటే ఇదేనేమోననిపించింది మగమహారాజులకిద్దరికీ. ఆ లోకంలో ఇంకొకరికి తావు లేదని గ్రహించారుకూడా! "కొడుకులూ కోడళ్ళూ కూతుళ్ళూ అల్లుళ్ళూ అనుకుంటామేగానీ నీలా, ఎవరికెవరున్నారు చెప్పు. నా సంగతే చూడు. వీరులూ, శూరుల్లా ముగ్గురు కొడుకులుండి పోయారా? కాలుగట్టి, నోరుగట్టి, పొదుపు చేసి, డొనేషన్లు ముట్టజెప్పి చదివించామా? పెళ్ళిళ్ళు చేశామా! బాగానే ఉంది. మాకేం ఒరిగింది అని ఆలోచించరే! పెద్దవాడు మాతో మాట్లాడి అయిదేళ్ళయింది. జన్మశత్రువుకుంటుందటమ్మా అంత వైరం? రెండేళ్ళక్రితం చిన్నాడికి పెళ్ళి చేస్తే, వాడుగానీ, వాడి పెళ్ళాం బిడ్డలుగానీ అటువైపు ముఖం చూపించి ఉంటే ఒట్టు. వాడికి మేమేదైనా అపచారం గానీ, ద్రోహం గానీ చేసివుంటామా? ఎందుకిలా జరిగింది? ఏమో, ఆ కోడలూ అయినింటి పిల్లేగదా! ఆవిడ మీద మేమెందుకు పితూరీలు చెప్పుకోవాలి? మన బంగారం మంచిది కాదనుకుంటే సరిపోలా! ఏదో ఒక కాలంలో కొంచెం మంచి బుద్ధి పుట్టి మాకోసం ఉంటుందని ఈయన ఒక ఫ్లాట్ కొని పెట్టబట్టి సరిపోయింది. లేకుంటే ఎవరిపంచలో పడివుండవలసి వచ్చేదో! ఇది మన ఇల్లు అన్న ధీమా ఒకటుండిపోయింది గదా, ఇక మేము కొడుకు ప్రాపకంలో ఉన్నట్టు లోకం భావించినా ఇబ్బంది ఏముంది? ఇంకా మాటాడితే అది మా పాలిటికి గౌరవమే! కోడలు ఉద్యోగానికెళ్ళిపోతే, మనుమడు కాన్వెంటుకు వెళ్ళిపోతే ఇల్లు కనిపెట్టుకుని ఉండడానికైనా ఎవరో ఒకరు కావాలి మరి. ఆపని మేము చేస్తున్నామాయె! హైదరాబాద్‌లో మాపని ప్రస్తుతానికి హాయిగానే ఉంది. మూడోవాడి సంగతి వదిలేశానా నీలా! వాడి పెళ్ళాం బంగారు చిలక.

ఒకావిడ- ఎక్కడ నుంచి వచ్చిందో, ఎలా వచ్చిందో నీలమణి పక్కన వాలిపోయింది. ఆమె ఒడిలో తల పెట్టుకుని నీలమణి దురపిల్లిపోతోంది.

గర్భంగా ఉన్నప్పుడు ఆమెను కంటికి రెప్పలా చూసుకోవడానికి నేను కావలిసొచ్చాను. నేనెక్కడ ఉంటే ఈయనా అక్కడే ఉండాలి. సరే, పుష్పకవిమానంలో ఈయనకున్నా చోటు దొరికింది. ఇప్పుడా అమ్మాయి ప్రసవానికని పుట్టింటికెళ్ళిందిలే! ప్రసవించి బిడ్డతో తిరిగొచ్చే టప్పటికి మళ్ళీ మేమక్కడ హాజరుగా ఉండాలని ఫర్మానా! సరే, ఇక ఆడకూతురు సంగతేమి టంటావా? ఆ డిపార్టుమెంటు పేరెందుకులే. అల్లుడు చాలా పెద్ద ఆఫీసరు. ఆమె అన్నదమ్ముల ఐశ్వర్యాన్ని ఖాతరు చెయ్యదు. 'మీరేమిటీ, నాకు పెట్టేదేమిటి?' అంటుంది. వీళ్ళూ నెల తక్కువగా పుట్టినవాళ్ళేం కాదే! 'నీ ముఖం మేము చూసేది లేదుపో' అనేది వీళ్ళ హఠం. కడుపు చించుకుంటే కాళ్ళమీద పడుతుందనుకో! నీలమ్మా, ఇలా ఉందమ్మా మా బతుకు. ఇంకొక సంగతి చెప్పనా నీకు. మా అపార్ట్‌మెంట్స్‌లోనే కింది వాటాలో రాధాబాయి అంటూ ఒకావిడ ఉంది. మూడేళ్ళయింది భర్త కళ్ళుమూసి. ఇద్దరు కొడుకులూ, ఓ కూతురూ అమెరికాలో ఉన్నారు. ఆమె భర్త పోయాక అమెరికా వెళ్ళి, ఆ జీవితంలో ఇమడలేక మూడే నెలల్లో ఉచ్చులు తెంచుకుని వచ్చేసింది. బతికినా ఇక్కడే, చచ్చినా ఇక్కడే అని ఆమె వైరాగ్యం. డబ్బుకేం కొదవ లేదు. కానీ, ఒళ్ళు నలతగా ఉన్నా, ఓ రోజు ఉదయం తెల్లవారేసరికి శరీరం నిస్త్రాణగా ఉండి లేచి నిల్చోడం వీలుగాకపోయినా నీ గతేమిటని అక్కర చూపించేవాళ్ళుండొద్దా? ఆకాశంలోని చందమామ నీదేనని బిడ్డల్ని బుకాయించగలం, కానీ, అతీ గతీ పట్టించుకోని బిడ్డల్ని, వాళ్ళు తమ బిడ్డలేనంటూ తల్లితండ్రులు హక్కుభుక్తాలు చలాయించడం ఎట్లా? పోనీ, నీ కొడుకు చాలా మంచివాడే. నిన్ను పువ్వుల్లో పెట్టి పూజించేవాడే. ఒప్పుకుంటాను. కానీ, వాడు 'క్యూ'లో ముందుండిపోయాడే! వాడి రైలొచ్చింది, వెళ్ళిపోయాడు. మనమూ మన

రైలొచ్చినప్పుడు వెళ్ళిపోతాం. భూప్రపంచకంలో ఉట్టిగట్టుకుని కలకాలం ఊరేగేవాళ్ళెవరు? ఈ మాత్రానికి దుఃఖమెందుకే వెర్రి మొగమా!"

ఏర్పేడులో దిగి వాళ్ళు వ్యాసాశ్రమంలో ఒక రోజు గడిపారు. కొండల ఒడిలో ఆశ్రమం నిమ్మకు నీరెత్తినట్టు ప్రశాంతంగా ఉంది. నాలుగు వైపులా కలయతిరిగేనరికి పదకొండున్నర కావచ్చింది. ఆశ్రమ సంస్థాపకుల పేరిట భక్తులు కట్టించిన ఎత్తైన స్థూపం పైకి వెళ్ళడం ఒక అపురూపమైన అనుభవం. ఉదయం నుంచీ ఆకాశాన మబ్బులు దట్టంగా సంచరిస్తున్నాయి. అయినా, మెట్లెక్కి పదకొండో అంతస్తు చేరుకునే నరికి బాగా చెమట పట్టిపోయింది.

స్థూపం పై భాగంలోని డోమ్‌లో చిన్న కిటికీల గుండా కొండగాలి వింజామరలు వేస్తోంది. పద్మాసనం మీద కూర్చుని ధ్యాన నిష్ఠలో ఉన్న ఒక యోగి అడుగుల సవ్వడి వినిపించగానే కళ్ళుదెరిచి దరహాసంతోనే వాళ్ళ నాహ్వానించాడు. విశ్వాసం అనేది రక్తంలో ఉండాలి. అది కొందరిలో ఉంటుంది. కొందరిలో ఉండదు. మగవాళ్ళు ఎడంగా నిలబడి తటపటాయిస్తూ ఉండగానే, ఆడవాళ్ళు మరొక ఆలోచన లేకుండా యోగి ఎదుట సాష్టాంగపడి నమస్కరించారు. తరువాత ఉపదేశం పొందడానికి సిద్ధమైన ఆశ్రమవాసినుల్లా లేచి ఆయన ఎదుట కూచున్నారు. సత్యవతే నివేదించింది– "స్వామీ, ఇది నీల. నా స్నేహితురాలు. రారాని కష్టం వచ్చింది దీనికి. ప్రాణానికి ప్రాణమైన బిడ్డ పోయాడు. చింత దీని గుండెను తొలిచేస్తోంది. నాలుగు మంచి మాటలు చెప్పరూ?"

స్వామీజీ ప్రవచనం దాదాపోక గంట సేపు కొనసాగింది: 'ఎవరైనా చనిపోతే మనం అతడు కాలధర్మం చెందాడని చెప్పుకుంటాం. కాలం యొక్క ధర్మమే మృత్యువు. ప్రవాహం గట్టు పైని చెట్లు నిలబడి ఉంటాయి. క్రమక్రమంగా ప్రవాహం వేళ్ళను కోసేస్తూ ఉంటుంది. తల్లి వేరు గూడా తెగిపోయాక చెట్టు ప్రవాహంలో కూలిపోయి కొట్టుక పోతుంది. మనమున్నూ అట్లాగే కాలప్రవాహం ఒడ్డున నిలబడి ఉన్నవాళ్ళం. కొంచెం ముందుగానో, వెనుకగానో అందులో పడి కొట్టుక పోయేవాళ్ళమే. దాని చూపే చట్టం. మాటే శాసనం. కాలానికెదురేముంది తల్లీ?' ఇదీ సారాంశం.

మరునాటి ఉదయం మళ్ళీ యాత్ర కొనసాగింది. కాళహస్తీశ్వరాలయంలో సత్యవతి నీల కోసం ఏవో పూజలు చేయించింది. ఆపైన సువర్ణముఖీ తీరంలో ఉన్న శుక బ్రహ్మాశ్రమంలో రెండు రోజులుండిపోయారు. గీతా మకరందం రెండు ప్రతులు కొని, ఒకటి స్నేహితురాలికి బహూక రించింది సత్య. "ఎప్పుడుబడితే అప్పుడు ఎవరోదారుస్తారు నిన్ను? మనసు బాగుండనప్పుడల్లా ఇందులో ఒక అధ్యాయం చదువుకోవే నీలా. మనో దౌర్బల్యానికి ఇదేనట మంచి టానిక్కు."

"మీరు మా కోసం ఇప్పటికి తీసుకున్న శ్రమే ఎక్కువ. ఇంతకు మించి మీకు పనిపెట్టడం మాకిష్టం లేదు. మీరిట్లాగే హైదరాబాదు వెళ్ళండి. మేము బస్సులో మా ఊరెళ్ళిపోతాం" అన్నాడు రమణమూర్తి. "అబ్బే, అదేం కుదరదండీ బావగారూ. మిమ్మల్ని మీ ఇంటి దగ్గర దిగబెట్టాకనే మా తిరుగు ప్రయాణం" అంది సత్యవతి.

ఆరోజు ఉదయం తొమ్మిదింటికి బయల్దేరవలసి ఉండనగా సీతాపతి, రమణమూర్తి ప్రాతఃకాలపు వాహ్యాళికి వెళ్ళి వస్తున్నారు. అతిథుల గదుల ముందున్న వసారాలో నడుస్తూ రమణమూర్తి ఉన్నట్టుండి ఆగిపోయాడు.

> రమణమూర్తి ఉన్నట్టుండి ఆగిపోయాడు. "ఆ నవ్వుల కలకలం విన్నారా? నీల గూడా నవ్వుతోంది. ఆమె మనసు విప్పి నవ్వగా విని ఎంత కాలమైందో" అన్నాడు.

"ఏమిటండీ! ఎందుకూ" అన్నాడు సీతాపతి విస్తుపోతూ. "ఆ నవ్వుల కలకలం విన్నారా? నీల గూడా నవ్వుతోంది. ఆమె మనసు విప్పి నవ్వగా విని ఎంత కాలమైందో" అన్నాడు రమణమూర్తి.

తాను నేర్చిన మాటలన్నీ ఖర్చయిపోయినట్టు తిరుగు ప్రయాణంలో చాలా సేపటివరకు మౌనంగా ఉండిపోయింది సత్యవతి. ఆ తర్వాత మెల్లగా, "నా మాటల్తో మిమ్మల్ని బాగా బోరు కొట్టించేశానేమో. మీరేమైనా చెప్పగూడదా బావగారూ" అంటూ రమణమూర్తి వైపు చూసింది.



"ఏం చెప్పనమ్మా! ఎప్పుడు, ఎక్కడ చదివానో గుర్తు లేదు. 'మళ్ళీ ఎప్పుడో, ఎక్కడో' అని ఆ కథ పేరు. కాలేజీలో కలిసి చదువుకుని విడిపోయిన స్నేహితురాళ్ళిద్దరూ విజయవాడ స్టేషన్ ప్లాట్‌ఫారం పైన కలుసుకుంటారు. ఒకరి ఆచూకీ ఒకరికి తెలియకుండా పదిహేనేళ్ళు గడచి పోయాయి. ఇంతకాలానికి కలుసుకున్న సంభ్రమంలో వెంటనే నోట మాటలు రాని పరిస్థితి. వివాహాలు, సంసారాలు, బిడ్డలు, బదిలీలు... ఇలా ఎన్నో విశేషాలు వెళ్ళబోసుకో వలసి ఉంది. కానీ, ఉన్న వ్యవధి పది పదిహేను నిమిషాలు మాత్రమే. ఎన్ని విషయాలని చెప్పుకుంటారు? ఒక రైలుకు గంట మోగగానే వనజ, 'వస్తానే, వస్తానే' అంటూ తన బిడ్డలతోబాటు భర్త వెంట వెళ్ళిపోతూ ఉంటుంది. వెనుక నుంచి మీనాక్షి, 'ఇంతకాలానికెట్లాగో కలుసుకున్నాం. మళ్ళీ ఎప్పటికో పునర్దర్శనం" అంటూ దిగాలుపడిపోతూ ఉంది.

'మళ్ళీ ఎప్పుడో, ఎక్కడో' అని నిట్టూరుస్తూ సాగిపోతుంది వనజ. మనదేశంలో స్నేహితురాళ్ళ మధ్య నెలకొనే అనుబంధం అలా ఉంటుంది. ఎటొచ్చీ నువ్వెందుకు మినహాయింపుగా తోస్తున్నావమ్మా సత్యా. అవాంతరపు సుడిగుండంలో గిలగిలలాడిపోతున్న స్నేహితురాలిని సముదాయించాలన్న కోరిక ఉంటే సరిపోయిందా? నూరు నుగ్గబెట్టి ఆ కోరికను చెల్లించగలిగే జీవిత భాగస్వామి గూడా ఉండాలి గదా. ఆవిధంగా నువ్వు గొప్ప అదృష్టవంతురాలివి" అన్నాడు రమణమూర్తి.

"అబ్బే, నా ప్రసక్తి తెచ్చి పొగడ్తలు గుప్పించకండి" అన్నాడు సీతాపతి కొంచెంగా కించపడిపోతూ.

కారు గమ్యం చేరుకుంది. తేలిగ్గా ఓ కప్పు కాఫీ మాత్రం పుచ్చుకుని సత్య, సీతాపతి ఆరుబయటికి వచ్చి నిల్చున్నారు. ఎలా వీడ్కోలు చెప్పాలో తోచక, కాసేపు తటపటాయించిన తర్వాత, అందీ అందనట్టుగా ఉన్న భావమేదో తటాలున స్ఫురించినట్టయింది రమణమూర్తికి. "ఇందాకా నిన్ను అదృష్టవంతురాలివని చెప్పాను గదమ్మా! అందుకు జోడింపుగా మరొక మాట చెప్పాలి. నిన్ను నిన్నుగా ప్రేమించడానికి, నీ కోసమని కన్నీరు నించడానికి, నీ మనసులో మనసై మనలుకోడానికి ఒక నేస్తం ఉండడం కన్నా గొప్ప భాగ్యం ఏముంటుందంటాడు కవి. ఆవిధంగా నీల గూడా అదృష్టవంతురాలే."

సత్యవతి తన కళ్ళలో నీళ్ళెక్కడ కనిపించిపోతాయెమోనని వంచిన తల పైకెత్తనే లేదు. నీలమణి కన్నీళ్ళు తుడుచుకుంటూ అటువైపుగా ముఖం తిప్పుకుంది. సీతాపతి మెల్లగా వీధివైపు సాగబారిపోయాడు. రమణమూర్తి ఒక్కడు మాత్రం స్థాణువులా నిల్చుండిపోయాడు.

తానెలాగైతే వచ్చిందో, అలాగే నిశ్శబ్దంగా వెళ్ళిపోయి సత్యవతి కారులో కూర్చుంది. తెరిచిన కిటికీలో నుంచి నీలమణి మెడలోపలికి సాచింది. స్నేహితురాళ్ళు ఏం మాట్లాడుకుంటున్నారో రమణమూర్తికి వినిపించలేదు. కానీ, సత్య రెండు చేతుల్నీ నీల భుజాల పైన వేసి దగ్గరికి వంచుకూంటూ, ఆమె చెంప మీద ముద్దు పెట్టుకోవడం రమణమూర్తికి కనిపించింది. ■